పెన్నాడ వంకాయలకు భలే గిరాకీ

- గణపవరం, నిడమర్రు మండలాల్లో సాగు
- కూరగాయలు, ఆకుకూరల పంటలు వేస్తున్న రైతులు
- దళారుల చేతుల్లోనే మార్కెట్ ధర


విరగకాసిన వంకాయలు


గోంగూర పంట

గణపవరం: ఆహా ఏమి రుచి, తినరా మైమరచి, తాజా కూరలలో రాజా ఏదంటే, వేరే చెప్పాలా వంకాయ కూరేనని..ఓ సినీ కవి రాసిన ఈపాట వింటేనే కూరగాయలలో వంకాయకున్న ప్రాముఖ్యత ఏపాటిదో తెలుస్తుంది. గుత్తి వంకాయకూర... ఈ మాట వింటేనే నోరూరుతుంది. వంకాయ కూర ఇష్టపడని వారు ఉండరు. గుత్తి వంకాయ కూరను వర్ణించని కవులు, రచయితలు, ఉండరేమో.. ఇక సినీ కవులైతే ఏకంగా గుత్తి వంకాయ కూరలపై లెక్కలేన్ని పాటలు రాశారు. అందులోనూ పెన్నాడ వంకాయలతో చేసిన గుత్తివంకాయ కూరైతే దాని రుచే వేరు. గుత్తి వంకాయను నోట్లో వేసుకుంటేనే వెన్నపూసలా కరిగిపోతుంది. జిల్లా వ్యాప్తంగా పెన్నాడ వంకాయలకు మంచి పేరుంది. గతంలో భీమవరం సమీపంలోని పెన్నాడ గ్రామంలో ఎక్కువగా రైతులు ఈరకం వంకాయలను పండించేవారు. చిరువ్యాపారులు పెన్నాడ వంకాయలను జిల్లా నలుమూలలకూ తిరిగి అమ్మకాలు చేసేవారు. ఇటీవల పెన్నాడకు చెందిన కొందరు రైతులు ఎక్కడ ఖాళీ స్థలాలు కనపడినా లీజుకు తీసుకుని వంగ తోటలతో పాటు, తోటకూర, గోంగూర వంటి ఆకుకూరలు పండిస్తూ స్థానికంగా వ్యాపారం చేస్తున్నారు. దీనితో పెళ్లిళ్లు, పేరంటాలు ఇతర అన్ని రకాల ఫంక్షన్‌లకు పెన్నాడ వంకాయలను వినియోగిస్తున్నారు. దీనితో ఈ వంకాయలకు స్థానికంగా డిమాండ్ ఉంటుంది. గణపవరం, నిడమర్రు మండలాల్లో కొన్ని గ్రామాల్లో పూడిక చేసిన పొలాలను కొందరు లీజుకు తీసుకుని కూరగాయల సాగు చేస్తున్నారు.

ఆదాయం అంతంత మాత్రమే

ఏడాది పొడవునా కూరగాయల తోటలను కంటికి రెప్పలా చూసుకుంటూ లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి సాగుచేస్తున్నా, ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటోందని రైతులు వాపోతున్నారు. వంకాయల విక్రయాలు, ధర దళారుల దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడుతోందన్నారు. ఇటీవలి వరకూ పెన్నాడ వంకాయలు కిలో రూ.100 నుంచి రూ.120 వరకూ విక్రయించగా, ప్రస్తుతం ఈధర కిలో రూ.60కు పడిపోయిందని సాగు చేసే రైతులు వాపోతున్నారు. పంట దిగుబడి బాగున్నప్పుడు ధర పడిపోయి నష్టపోతున్నామంటున్నారు. ఎకరాకు కనీసం రూ.2 లక్షల వరకూ పెట్టుబడి పెడతారు. దీనిలో అధిక భాగం ఎరువులు, పురుగు మందులకే ఖర్చవుతుంది. మొక్కలకు నిత్య నీరు ఇంజన్లతో తోడాల్సిందే. దీనితో ఆయిల్ ఖర్చు కూడా పెరుగుతోంది.

కష్టానికి తగ్గ ఫలితం లేదు



తాతలకాలం నుంచి కూరగాయల సాగు, వ్యాపారం చేస్తున్నాం. ఎప్పుడూ కష్టానికి తగిన ఫలితం ఉండటం లేదు. బువ్వనపల్లిలో ఖాళీ దిబ్బ లీజుకు తీసుకుని పెన్నాడ వంకాయలు, గోంగూర, తోటకూర సాగు చేస్తున్నాను. వంకాయలు రెండురోజులకోసారి కోస్తే సుమారు క్వింటాలు దిగుబడి వస్తుంది. వంకాయలు భీమవరం మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తాం. ప్రస్తుతం కిలో ధర రూ.100 నుంచి రూ.70కు పడిపోయింది.

కేసిరెడ్డి వెంకటేష్, రైతు, పెన్నాడ


ఓల్డేజ్ డే కేర్ సెంటర్ ప్రారంభం


మాట్లాడుతున్న ఐఆర్‌ఏఎస్ విజయ్‌పాల్

ఉంగుటూరు: ఏఎంజీ ఇండియన్ ఇంటర్నేషనల్ ఓల్డేజ్ డే కేర్ సెంటర్‌ను బొమ్మిడిలో శనివారం ప్రారంభించారు. ఈ సెంటర్‌లో వృద్ధులకు ప్రతి రోజూ భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమం సంస్థ ఫౌండర్ రిటైర్డ్ ఐఏఎస్ తాటిపాక గోపాలరావు ఆధ్వర్యంలో ఆయన కుమారుడు తాటిపాక అశోక చక్రవర్తి, వరలక్ష్మి నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల త్రిమూర్తులు, మేడవరపు కిరణ్, ఐఆర్‌ఎస్ రామాప్రతాప్, విజయ్‌పాల్, రాంబాబు, రమణ, బొమ్మిడి మెంబర్–2 పీసీ కమిటీ చైర్మన్ టి.వీరరాఘవులు ఉపాధ్యాయులు డి.జోగినాయుడు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం 50 మంది వృద్ధులకు భోజన వసతి కల్పించారు.

క్లుప్తంగా

పోతునూరు సచివాలయ నిర్మాణం పూర్తి


పోతునూరులో నిర్మించిన సచివాలయం

దెందులూరు: పోతునూరులో రూ.40లక్షల వ్యయంతో నూతన సచివాలయ నిర్మాణం పూర్తయిందని ఎంపీపీ బొమ్మన బోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు. శనివారం సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. త్వరలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరితో ప్రారంభోత్సవం చేయిస్తామన్నారు. వారి వెంట సొసైటీ మాజీ చైర్మన్ డీఎస్‌వీ ప్రసాద్ (బజ్జి), ఎంపీటీసీ సున్నా నరేష్, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, పార్టీ నాయకులు బుద్దా అర్జున తదితరులున్నారు.

14న ఎమ్మెల్యే శ్రీరామవరం రాక

దెందులూరు: శ్రీరామవరంలో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని నివాసంలో ఈ నెల 14న ఉదయం 9 గంటలకు మండల పరిధిలోని జగనన్న సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల సంయుక్త సమావేశం నిర్వహిస్తున్నట్టు గ్రామ పార్టీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు.

వేదకుమారికి సత్కారం


దెందులూరులో వేదకుమారిని సత్కరిస్తున్న జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం

దెందులూరు: విజయవాడ కనకదుర్గమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, కృష్ణని శనివారం జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, మండల నాయకులు నిట్టా గంగరాజు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిళ్లెం శ్యామ్‌తంబి, సచివాలయాల మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ డాక్టర్ బాషాకు సత్కారం


గోపన్నపాలెంలో ప్రిన్సిపల్ డాక్టర్ సలీం బాషాను సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల ప్రిన్సిపల్‌గా ఇప్పటివరకు సేవలందించిన డాక్టర్ సలీంబాషా అభినందనీయులని నూతన ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ అన్నారు. శనివారం వ్యాయామ కళాశాలలో బదిలీ అయిన ప్రిన్సిపల్ బాషాను కళాశాల నూతన ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు.

కౌలు రైతు సంఘం నాయకుడి మృతికి సంతాపం

భీమడోలు: కౌలు రైతు సంఘం నాయకులు, కోడూరుపాడు మాజీ సర్పంచ్ గంజి నాగేశ్వరరావు కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి చేసిన కృషి మరవలేనిదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, జి.ప్రసాదరావు, కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు అన్నారు. శనివారం గంజి నాగేశ్వరరావు మృతికి వారు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కారానికి గంజి నాగేశ్వరరావు చేసిన సేవలు మరవలేనివని, ఆయన మృతి కౌలు ఉద్యమానికి తీరని లోటు అన్నారు.

దీన్‌దయాళ్ సేవలు చిరస్మరణీయం

భీమడోలు: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి అన్నారు. భీమడోలు బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని శనివారం నిర్వహించారు. దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శరణాల మాలతీరాణి మాట్లాడుతూ బీజేపీని బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ ప్రసాద్, జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు మత్తి శ్రీనివాసశాస్త్రి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిపల్లి కృష్ణకుమారి, మండల కార్యదర్శి సాదిని సాయిదీపిక, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారమే లోక్ అదాలత్ లక్ష్యం


భీమడోలు కోర్టులో కేసులను పరిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఆదిత్య రిషిక్

భీమడోలు: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడతాయని భీమడోలు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, జూనియర్ సివిల్ జడ్జి తల్లాప్రగడ అంజనీ ఎస్ఎస్ రామఆదిత్య రిషిక్ అన్నారు. భీమడోలులోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి ఆదిత్య రిషిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భీమడోలు, ద్వారకా తిరుమల, దెందులూరు మండలాల పరిధిలో కోర్టులో పెండింగ్‌లో ఉన్న 49 కేసులను, 236 పేకాట, డ్రంక్ డ్రైవ్ కేసులు పరిష్కరించారు. క్రిమినల్ కేసులు, గృహ హింస, భరణం, బ్యాంకు సంబంధించి నేరం అంగీకారం తదితర రూ.3.10 లక్షలు విలువ గల 49 కేసులను పరిష్కరించారు. కోడిపందేలు, పేకాట, డ్రంక్ డ్రైవ్ 236 కేసులకు రూ.6,02,585 రికవరీ చేసారు. ఈ సందర్భంగా జడ్జి రిషిక్ మాట్లాడుతూ ఇరువర్గాల అంగీకారంతోనే కేసులు పరిష్కారమవుతాయన్నారు. సమయం, డబ్బు వృథా కాకుండా మధ్యవర్తిత్వం ద్వారా ఈ కేసులను పరిష్కరించేందుకు ఈ లోక్ అదాలత్‌లు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు బార్ అసిసోయేషన్ అధ్యక్షుడు గొరింకల విజయరాజు, ప్రధాన కార్యదర్శి కరణం మోహనశ్రీనివాస్, లోకాలత్ సభ్యులు ఎస్.గోపాలకృష్ణ, న్యాయవాదులు అల్లాడ గంగాధరరావు, కె.గంగరాజు, టి.ప్రకాష్, పి.సంపత్ రావు, పి.రాజారావు, టి.రమేష్, శశాంక్, పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయం ఏర్పాటుపై పునరాలోచించాలి

దెందులూరు: ఏలూరులోని డీఎస్పీ కార్యాలయాన్ని నూజివీడు తరలించడం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు బీవీఆర్‌కే చౌదరి అన్నారు. శనివారం దెందులూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్పీ కార్యాలయం ఏలూరులో ఉంటే పెదవేగి, పెదపాడు, దెందులూరు, ఏలూరు మండలాల ప్రజలకు పూర్తి సౌకర్యంగా ఉండేదన్నారు. నూజివీడులోని డీఎస్పీ కార్యాలయానికి వెళ్లాలంటే మండలంలోని ప్రజలు రాకపోకలకు 50 కిలోమీటర్లు పయనించాల్సి వస్తోందని ఆయన తెలిపారు. డీఎస్పీ అందుబాటులో లేకుంటే రోజంతా అక్కడే వేచి ఉండాల్సి వస్తోందని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన సర్కిల్ కార్యాలయం పెదవేగిలో కాకుండా నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన దెందులూరులో ఏర్పాటు చేయాలని చౌదరి కోరారు.

విశ్వవిద్యాలయాల క్రీడాపోటీల్లో సత్తా చాటాలి


క్రీడాపోటీలకు వెళుతున్న ఆది కవి నన్నయ్య విశ్వవిద్యాలయం జట్టుతో అధ్యాపకులు

దెందులూరు: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం (రాజమండ్రి) మహిళలు, పురుషుల జట్లు ఆదివారం బెంగుళూరులో నిర్వహించనున్న అంతర్ విశ్వవిద్యాలయాల 10 కిలోమీటర్ల పరుగు పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ పోటీలో పాల్గొనే క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ కోరారు. మహిళల విభాగంలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ జట్టు తరపున పోటీ పడనున్న వీ.పూజ, డీ. లీలావతి, జీ. నంది, ఎస్.లక్ష్మి, వీ. గంగాభవాని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలకు చెందిన విద్యార్థినులని ఆయన తెలిపారు. ఈ టీంకు మేనేజర్‌గా ఎస్. వెంకటేశ్వరరావు వ్యవహరిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరక్టర్ డాక్టర్ ఎం. మనోహర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీడీకేవీ ప్రసాద్, లెక్చరర్లు శ్యామలాదేవి, రమేష్, జయలక్ష్మి, సిబ్బంది జట్టును అభినందించారు.

రైతు భరోసా కేంద్రాల్లో విస్తృత సేవలు



భీమడోలులోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

భీమడోలు: భీమడోలులోని ప్రైవేటు పాఠశాల నిర్వహిస్తున్న సస్య భారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం బాలబాలికలు సహ పాఠ్య కార్యకలాపాల్లో ఉత్సాహంగా పాల్గొని స్వీయ అనుభవాలను పొందారు. భీమడోలు నం.3 రైతు భరోసా కేంద్రాన్ని బాలబాలికలు సందర్శించారు. అక్కడి నుంచి రైతులకు ప్రభుత్వం అందించే విస్తృత సేవలను గ్రామ కార్యదర్శి ఎం.హేమసుందర్ చిన్నారులకు వివరించారు. రైతుల వస్త్రాలంకరణలో చిన్నారులు వరి క్షేత్రాల్లోకి వెళ్లి ఆకు మడి, ఊడ్పు, వరి ఎదుగుదల, ఎరువులు, పురుగు మందుల పిచికారీ విధానం వరి కలుపు, గడ్డి మోపులు కట్టడం వంటి అంశాలను స్వీయ అనుభవాలను పొందారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందుతున్న సేవల పట్ల పాఠశాల సిబ్బంది, చిన్నారులు ఆనందాన్ని వ్యక్తం చేసారు. రైతులకు ఆర్‌బీకే ద్వారా పూర్తిస్థాయిలో సేవలందుతున్నాయని ప్రిన్సిపల్ డి.సోఫియా, ఏవో ముఖేష్, డీస్ బి.భార్గవ్‌కిరణ్, ఇన్‌చార్జి మంజుల పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



వెంకటాపురంలో చెరువు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న అక్కినేని రాజశేఖర్

పెదపాడు: గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ అన్నారు. పెదపాడు మండలంలోని వీరమ్మకుంట శివారు వెంకటాపురంలో మంచినీటి చెరువు అభివృద్ధి పనులు శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వెంకటాపురం మంచినీటి చెరువును 25 ఏళ్ల క్రితం అభివృద్ధి చేశారని, నీరు బాగుండటం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకురావడంతో ఆయన చెరువును అభివృద్ధి చేయాలని ఆదేశించారని తెలిపారు. మంచినీటి చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా అక్కడ ఉన్న నీటిని బయటకు పంపి మరలా కొత్తనీటితో చెరువును నింపుతామని చెప్పారు. దీంతోపాటు తప్పుల తొలగించి గట్లను పటిష్టపర్చడం, పూడిక తొలగింపు పనులు చేపట్టినట్టు తెలిపారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు స్థానిక వార్డు మెంబరు గండికోట యోహాను, గ్రామ సచివాలయం కన్వీనర్ గండికోట శ్రీను నక్కా శివకృష్ణ, కొత్తూరు విమలారావు పాల్గొన్నారు.

వేగేశ్న ఫౌండేషన్ సేవల్లో నూకయ్య పాత్ర మరువలేనిది

గణపవరం: వేగేశ్న ఫౌండేషన్ తరపున చేస్తున్న సేవా కార్యక్రమాల్లో దివంగత నూకయ్య పాత్ర మరువలేనిదని పలువురు నాయకులు నివాళులర్పించారు. ఇటీవల మరణించిన వేగేశ్న ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అధినేత వేగేశ్న ఏసుధాతరాజు సతీమణి శ్రీమతి నూకయ్య సంస్మరణ సభ శనివారం గణపవరంలో నిర్వహించారు. సభలో పాల్గొన్న పలువురు నాయకులు నూకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు, మాజీ ఎమ్మెల్యేలు పసల కనకసుందరరావు, కలవపూడి శివ, వైఎస్సార్ సీపీ నాయకులు కాకర్ల శ్రీను, నడింపల్లి సోమరాజు, పసల గంగారామ చంద్రన్, ఇందుకూరి సత్యనారాయణరాజు, పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుబాబు, బాపిరాజు మాట్లాడుతూ వేగేశ్న ఫౌండేషన్ తరపున కోట్లాది రూపాయలతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న నూకయ్య కుమారులు అనంత కోటిరాజు, ఆనంద రాజును పరామర్శించారు.

వసంత్‌నగర్‌లో తాటాకిల్లు దగ్ధం


వసంతనగర్‌లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

భీమడోలు: అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని వసంత్‌నగర్ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శనివారం రాత్రి ఓ తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. బొంతు కృష్ణకుమారి ఇంట్లోంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించింది. సమాచారం అందుకుంటున్న భీమడోలు అగ్నిమాపక అధికారి జి.నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేసారు. అప్పటికే ఇంటిపై కప్పు, గృహోపకరణాలు కాలిపోయాయి. బాధిత మహిళ కుటుంబం నిరాశ్రయులైంది.

ఉద్యాన రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): నిమ్మ, అరటి, కూరగాయల తదితర ఉద్యానవన పంటల రైతుల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో శనివారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొండ పందిర్ల సబ్సిడీ బకాయిలు నాలుగేళ్లుగా ఇవ్వకపోవడం, మార్కెట్లో కనీస ధర రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలని కోరారు. ఎరువులు, పురుగు మందులు సబ్సిడీలు అందించాలన్నారు. సామాజిక వన విభాగం 2019–20 ఆర్థిక సంవత్సరంలో అటవీ శాఖ ద్వారా చేపట్టిన కొబ్బరి మొక్కల పెంపకం, పంపిణీలో చోటుచేసుకున్న భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ కోరారు.

దంత సంరక్షణకు అత్యాధునిక వైద్య చికిత్సలు


దంత వైద్య విద్యార్థులకు ఆధునిక వైద్య విధానాలను వివరిస్తున్న ఇటలీ వైద్యుడు జియోవాని కావల్లి

పెదవేగి : దంత సంరక్షణకు అత్యాధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, భారతదేశ దంత వైద్య విధానం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని ఇటలీకి చెందిన ప్రముఖ దంత వైద్యులు జియోవాని కావల్లి అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల్లోని సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాలలో ఈనెల 8 నుంచి 11 వరకు సీడీఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జియోవాని కావల్లి ఆయన బృందం పాల్గొన్నారు. నాలుగు రోజులపాటు నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎస్ స్లీవరాజు, కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి మోజెస్, ఫాదర్‌లు రాజు, డామినిక్‌ల ఆధ్వర్యం వహించారు. ముందుగా ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ జియోవాని కావల్లి దంత వైద్య విధానంలో ఆధునిక పరికరాల ప్రాముఖ్యత, వాటి వినియోగం ద్వారా దంత సమస్యలను ఏ విధంగా నివారించవచ్చనేది వివరించారు. ఇటీవల సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలను విద్యార్థులకు వివరించారు. పంటి సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం చాలా వరకూ దంత సమస్యను మొదటి దశలోనే నివారించవచ్చని వివరించారు. దంత చికిత్స అంటే కేవలం పన్ను తీసి, వేయించుకోవడమే కాకుండా మరిన్ని ఆధునిక చికిత్సల ద్వారా దంతాన్ని సంరక్షించుకోవచ్చని ప్రజలకు తెలియజేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ నిర్వహించారు. దంత వైద్య రంగంలో అందించిన సేవలకు విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువాతో సత్కరించారు.

నేటి నుంచి మహాశివరాత్రి వేడుకలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఏలూరు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆ శాఖ నిర్వాహకురాలు బీకే లావణ్య తెలిపారు. శనివారం స్థానిక బ్రహ్మకుమారీస్ ఏలూరు శాఖ సేవా కేంద్రంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. 12వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రారంభిస్తారని, దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలను స్థానిక శ్రీరామ్ నగర్‌లోని తమ సేవా కేంద్రంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. 19వ తేదీ వరకు ఈ జ్యోతిర్లింగాలను దర్శించుకోవచ్చని కోరారు. కార్యక్రమాల్లో ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు, బ్రహ్మకుమారీస్ వరంగల్ జోన్ డైరెక్టర్, రాజయోగిని బీకే సవిత, బీకే సుధాకర్ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో బీకే మమత, బీకే హిమబిందు, బీకే రాణి, బీకే లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి

ఏలూరు టౌన్: హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని ఎమ్మెల్యే నాని సూచించారు. ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యులుగా పెద్దిరెడ్డి పద్మజ్యోతిని ప్రభుత్వం ఇటీవల నియమించింది. దీంతో ఆమె ఏలూరులో ఎమ్మెల్యే, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు నానిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యునిగా నియమించటంలో ప్రోత్సహించిన ఎమ్మెల్యే నానికి ప్రత్యేకంగా పద్మజ్యోతి, శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ పార్టీ కోసం నిస్వార్థంగా సేవలు అందించే ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా నిలుస్తుందని, ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్న వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావటానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారని గుర్తుచేశారు. ద్వారకాతిరుమల దేవస్థానం ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేలా సేవలు అందించాలని సూచించారు. నిత్యం వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా మౌలిక సదుపాయాలు, సేవలు అందించాలని ఎమ్మెల్యే నాని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, నాయకులు చెలికాని రాజబాబు ఉన్నారు.